అక్రమ నిర్మాణాలు.. అధికారులకు ఆదాయ మార్గాలు

- శివారు పెద్దఅంబర్‌పేట్‌లో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు
- మున్సిపాలిటీకి కోట్ల ఆదాయం గండి
- అక్రమ నిర్మాణాలను అరికట్టడంలో అధికారులు విఫలం

అబ్దుల్లాపూర్‌మెట్, మే 22(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ శివారు పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీలో అధికారులు అక్రమ ఆదాయ మార్గాలకు అలవాటు పడ్డారు. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్ విభాగంలో భవన నిర్మాణ అనుమతుల ద్వారా మున్సిపాలిటీకి రావాల్సిన కోట్ల రూపాయల ఆదాయం కొందరు అవినీతి అధికారుల మూలంగా పక్కదారి పడుతోంది. అక్రమ నిర్మాణదారులకు స్థానిక నేతల సహకారంతో అధికారులే సలహాదారులుగా వ్యవహరిస్తూ అక్రమ నిర్మాణాల విషయంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. మున్సిపల్ ఉన్నత అధికారితో పాటు టౌన్‌ప్లానింగ్ విభాగం సిబ్బందిపై పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విచ్చలవిడిగా నిర్మాణాలు

మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. అందులో కొన్ని అనుమతులు తీసుకుని.. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేస్తుండగా మరికొన్ని ఎలాంటి అనుమతులు లేకుండానే నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఇక కమర్షియల్ షెడ్లులు, సెల్లార్ల సంగతి అంతే. ఒకటి, రెండు కాదు పదుల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా మున్సిపల్ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు బలంగానే వినిపిస్తున్నాయి. 8 నెలలుగా ఒక్క అక్రమ నిర్మాణం జోలికి అధికారులు వెళ్లలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అనుమతుల ద్వారా అయితే మున్సిపాలిటీకి ఒక్కో షెడ్డు నుంచి సుమారు 20 నుంచి 50 లక్షల రూపాయల ఆదాయం సమకూరే భారీ అక్రమ షెడ్లులు పూర్తి అయ్యాయంటే ఇక్కడ అధికారుల చేతివాటం ఏ స్థాయిలో జరిగిందో తెలుస్తోంది. మున్సిపాలిటీ ఖాతాలో చేరాల్సిన కోట్ల



పెద్దఅంబర్‌పేట్ మున్సిపల్ కార్యాలయం(ఫైల్)

రూపాయల ఆదాయాన్ని తలాపాపం తిలా పిడికెడు అన్న చందంగా అధికారులు, స్థానిక నేతల జేబుల్లోకి వెళ్లినట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. అక్రమ నిర్మాణాల ద్వారా మున్సిపాలిటీ కోట్ల రూపాయల ఆదాయం కోల్పోతోంది. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఆదాయ మార్గాలను అన్వేషిస్తుండగా ఇక్కడ మాత్రం మున్సిపాలిటీకి వచ్చే ఆదాయాన్ని అధికారులు ఉచిత సలహాలతో గండికొట్టించడం ఆశ్చర్యం కలిగించే విషయం.

ఆపేదెలా..

అక్రమ నిర్మాణాల విషయంలో నిర్లక్ష్యం వహించొద్దని కొత్త ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తున్నా మున్సిపల్ అధికారులు మాత్రం ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోవడం లేదు. మున్సిపల్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై కనీస పర్యవేక్షణ కరువైంది. పలు నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చినా ఉన్నత స్థాయి అధికారి నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని నెలలుగా పదుల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. కనీసం ఒక్క అక్రమ నిర్మాణం పనులను కూడా అధికారులు ఆపలేకపోయారని విమర్శలు ఉన్నాయి. కొన్ని చోట్లా అక్రమ


ఎలాంటి అనుమతులు లేకుండా పెద్దఅంబర్‌పేట్‌లో నిర్మించిన భారీషెడ్డు

నిర్మాణదారులతో అధికారులు చేతులు కలిపి పనులను త్వరగా పూర్తి చేసుకోవాలని వారికి ఉచిత సలహాలు ఇస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాల చర్యలపై ఉన్నత అధికారుల నుంచి ఒత్తిడి వస్తే మాత్రం వాటికి నోటీసులను ఇచ్చాం అంటూ మున్సిపల్ అధికారులు చేతులు దులుపేసుకుంటున్నారు. అక్రమ నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకుని మున్సిపల్ ఆదాయాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఎంతైన ఉన్నదని పట్టణ ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

నోటీసులను ఇచ్చాం..



మున్సిపల్ పరిధిలో 33 అక్రమ నిర్మాణాలను గుర్తించాం. వాటన్నింటికి 3 సార్లు నోటీసులను అందించాం. ఎన్నికల కోడ్‌లో అక్రమ నిర్మాణాలను కూల్చివేయవద్దని కమిషన్ ఆదేశాలతో ఆలస్యం జరిగింది. కోడ్ ముగియగానే గుర్తించిన అక్రమ నిర్మాణాలను ఉన్నత అధికారుల ఆదేశాలతో కూల్చివేస్తాం. డీటీఎఫ్‌కు సమాచారం ఇచ్చాం.

- రవీందర్‌రెడ్డి, కమిషనర్ పెద్దఅంబర్‌పేట్


మాట్లాడుతున్న కమిషనర్ చంద్రశేఖర్

వానాకాలం వచ్చేస్తోంది.. అప్రమత్తంగా ఉండండి

- మునిసిపల్ సిబ్బందికి మీర్‌పేట్ కమిషనర్ సూచన

సరూర్‌నగర్, మే 22(ఆంధ్రజ్యోతి): ఈ నెలాఖరులోగా వానా కాలం వచ్చే సూచనలు కనిపిస్తున్నందున అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని మీర్‌పేట్ కమిషనర్ బి.చంద్రశేఖర్ సూచించారు. బుధవారం మునిసిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలని, ఎక్కడా కూడా వర్షం నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. వీధుల్లోని చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, ఇళ్లలోనూ చెత్త నిల్వ ఉండకుండా చూడాలని స్పష్టం చేశారు. మ్యాన్‌హోళ్లపై మూతల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, అవసరమైన చోట వెంటనే మూతలు ఏర్పాటు చేయాలని ఆయన పేర్కొన్నారు. ఇంజనీరింగ్, శానిటేషన్ ఉద్యోగులు, సిబ్బంది నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ డీఈఈ వెంకన్న, మేనేజర్ వెంకటొరెడ్డి, ఆర్వో అంజన్‌రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న సీపీఎం నాయకులు

ప్రభుత్వ భూమిని కాపాడాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

అబ్దుల్లాపూర్‌మెట్, మే 22 (ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూమిని కబ్జా చేసి అమ్ముకునేందుకు యత్నిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల నర్సింహ ఆధ్వర్యంలో బుధవారం రంగారెడ్డి కలెక్టర్ శశాంకకు ఫిర్యాదు చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ సర్వే నంబర్ 283లోని ప్రభుత్వ భూమిని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేసి ప్లాట్లుగా మార్చేందుకు యత్నిస్తున్నారని తెలిపారు. సుమారు 25 ఎకరాలకు కోర్టు ద్వారా నాట్ ఎంటర్ ఫీయర్ ఆర్డర్‌ను తీసుకువచ్చి కబ్జా పర్వానికి తెరలేపారని పేర్కొన్నారు. వెంటనే కోర్టు ఆర్డర్‌ను రద్దు చేయించి విలువైన ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు. కబ్జాకు యత్నిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పగడాల యాదయ్య, మండల కమిటీ సభ్యుడు గుండె శివ, చిర్ర శివ, ఇరుగు భిక్షపతి పాల్గొన్నారు.

ఘనంగా జిల్లెలగూడ వెంకన్న బ్రహ్మోత్సవాలు

సరూర్‌నగర్, మే 22(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడలో గల మత్స్యావతార వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం నిర్వహించిన పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్పొరేటర్లు కవితాబాల్‌రెడ్డి, మౌనికాశ్రీశైలం, రాజేందర్ రెడ్డి, ఆలయ వ్యవస్థాపక చైర్మన్ సంజయ్‌గోపాల్ సైంచర్, ఈవో శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరిముదిరాజ్, జ్ఞానేశ్వరాచారి, కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ మాజీ డైరెక్టర్ వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు కవాడిపల్లి విద్యార్థి ఎంపిక

అబ్దుల్లాపూర్‌మెట్, మే 22(ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్(ఎన్‌ఎంఎంఎస్)లో కవాడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఇ. సాత్విక్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడితో పాటు ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు. గత ఏడాది కూడా ఎన్‌ఎంఎంఎస్‌కు స్కూల్ నుంచి ఓ విద్యార్థి ఎంపిక అయినట్లు హెచ్‌ఎం దశరథరెడ్డి తెలిపారు. ఈ ఏడాది పదవ తరగతి ఫలితాల్లో కవాడిపల్లి ప్రభుత్వ పాఠశాల నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన తెలిపారు. తమ పాఠశాలలో డిజిటల్ తరగతులతో పాటు సాయంత్రం ఒక గంట విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం కూడా స్పెషల్ క్లాసులను నిర్వహిస్తున్నామని చెప్పారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.


లోప్రెషర్ నీటి సరఫరాపై కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేస్తున్న కాలనీవాసులు

లోప్రెషర్ నీటి సరఫరాపై కార్పొరేటర్‌కు ఫిర్యాదు

హయత్‌నగర్, మే 22(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్‌లోని అరుణోదయనగర్‌కాలనీ, రాఘవేంద్రనగర్‌కాలనీలలో లోప్రెషర్ నీటి సరఫరా జరుగుతుందని పలువురు కాలనీవాసులు బుధవారం కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన అరుణోదయనగర్‌కాలనీని సందర్శించి నీటి సరఫరాను పరిశీలించారు. అనంతరం జలమండలి అధికారికి ఫోన్‌చేసి లోప్రెషర్ నీటిపై ప్రశ్నించారు. రోజు విడిచి రోజు వస్తున్న తాగునీరు సరిపోవడంలేదని కాలనీవాసులు తెలిపారు. దీంతో ప్రైవేటు ట్యాంకర్లను ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. వెంటనే సమస్యను పరిశీలించాలని కార్పొరేటర్ జలమండలి అధికారులను కోరారు.

వరదనీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి


డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తున్న కార్పొరేటర్

వనస్థలిపురం, మే 22(ఆంధ్ర జ్యోతి): ప్రజలకు వరదనీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. మన్సూరాబాద్ డివిజన్‌లోని అగమయ్యనగర్‌కాలనీ నుంచి గణేష్‌నగర్ వరకు ఉన్న కాలనీలు వరదనీటితో ఇబ్బందులు తలెత్తుతున్నాయని కాలనీవాసులు బుధవారం కార్పొరేటర్ దృష్టికి తీసుకవచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో చిన్నపాటి వర్షానికే వరదనీటితో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముంపుకు గురయ్యే ప్రమాదం ఉన్న కాలనీలకు వరదనీటి సమస్యలు తలెత్తకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. కాలనీవాసులు ఆంజనేయులు, యాదయ్య, సతీష్‌కుమార్‌రెడ్డి, వెంకటాచారి, చంద్రశేఖర్, గోవర్ధన్, వెంకటయ్య, శ్రీరాములు పాల్గొన్నారు.



సరూర్‌నగర్ వెంకటేశ్వరకాలనీలో ప్రధాన రహదారిపై కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో బుధవారం నుంచి మజ్జిగ పంపిణీ ప్రారంభించారు. కాలనీ సంక్షేమ సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ బంగారు సందీప్ సౌజన్యంతో మజ్జిగ పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. బాటసారులు మజ్జిగ సేవించి సేదతీరారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలనీ, ఎండ వేడిమి నుంచి రక్షణ కోసం తమ వంతుగా చలివేంద్రం వద్ద మజ్జిగను పంపిణీ చేస్తున్నటు వెంకటేశ్వరకాలనీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పీఎస్ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, కోశాధికారి సాయికిరణ్, మధుసూదన్‌రెడ్డి, కిరణ్‌యాదవ్ పాల్గొన్నారు. - ఎల్బీనగర్, ఆంధ్రజ్యోతి

చెరువుల్లోకి మురుగునీరు చేరకుండా చర్యలు తీసుకోండి

- మునిసిపల్ అధికారులకు ఎమ్మెల్యే సబితారెడ్డి సూచన


మంత్రాలచెరువు పరిసరాలను పరిశీలిస్తున్న సబితారెడ్డి

సరూర్‌నగర్, మే 22(ఆంధ్రజ్యోతి): వానాకాలం వచ్చేలోగా చెరువుల సుందరీకరణలో భాగంగా చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పీ.సబితారెడ్డి అధికారులకు సూచించారు. చెరువుల్లోకి వరద(వాన) నీరు మాత్రమే ప్రవహించాలని, మురుగునీరు చెరువుల్లో కలువకుండా నేరుగా మూసీలోకి వెళ్లేలా చూడాలని ఆమె స్పష్టం చేశారు. బుధవారం సబితారెడ్డి మీర్‌పేట్‌లోని మంత్రాలచెరువును సందర్శించి అక్కడ జరుగుతున్న సుందరీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుందరీకరణలో భాగంగా చేపట్టిన పనుల్లో మిగిలిపోయిన పనులను తొందరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. పనుల్లో జాప్యం జరుగకుండా చూడాలని, భారీ వర్షాలు కురిస్తే పనులకు ఆటంకం కలిగే అవకాశమున్నందున ఆలోగా పనులు దాదాపుగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఆమె అధికారులకు సూచించారు. ఎక్కడా కూడా వరదనీరుగానీ, మురుగునీరుగానీ రోడ్లపై, వీధుల్లో, ఇళ్ల ముందు నిలువకుండా చూడాలని ఆమె స్పష్టం చేశారు. వర్షాలు కురిసినప్పుడు ప్రజల నుంచి తమకు ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మీర్‌పేట్ మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్‌రెడ్డి, కౌన్సిల్ బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, మునిసిపల్ డీఈఈ వెంకన్న, ఏఈ శ్రీనివాసులు, బీఆర్‌ఎస్ మీర్‌పేట్ శాఖ అధ్యక్షుడు కామేశ్‌రెడ్డి, నాయకులు లక్ష్మణ్‌ముదిరాజ్, ప్రభాకర్‌రెడ్డి, సునీతాబాల్‌రాజ్ పాల్గొన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

ఎల్బీనగర్: ప్రజల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని హరిపురికాలనీ, జనప్రియగార్డెన్, సరోజినీనగర్ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆమె అధికారులతో కలిసి పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు గుంతల మయం కావడమే కాకుండా డ్రైనేజీలైన్లు పొంగిపొర్లడం జరిగిందన్నారు. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలు మరోసారి ఉత్పన్నం కాకుండా తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వర్షపునీరు వచ్చిచేరి తమ కాలనీలో ఇళ్లు మునిగిపోతున్నాయని పలువురు కాలనీవాసులు ఎమ్మెల్యే ముందు వాపోయారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ ఈశ్వర్, జలమండలి ఏఈ రామకృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ పటేల్ సునీతారెడ్డి, డివిజన్ మహిళా అధ్యక్షురాలు ఊర్మిళరెడ్డి, గొడుగు శ్రీనివాస్, న్యాలకొండల శ్రీనివాస్‌రెడ్డి, సాజిద్, రాంనర్సింహగౌడ్, కంచర్ల శేఖర్, వెంకటేష్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, కాలనీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

హయత్‌నగర్‌లో దర్జాగా చెరువు జాలు కాల్వ కబ్జా

- కాల్వ పూడ్చి ప్లాట్లుగా మార్చిన వైనం

హయత్‌నగర్, మే 22 (ఆంధ్రజ్యోతి): గొలుసుకట్టు చెరువుల్లో భాగంగా ఏర్పాటు చేసిన జాలు కాల్వ నేడు కబ్జాకు గురి అవుతుంది. తుర్కయంజాల్‌లోని మాసబ్ చెరువు నుంచి అన్మగల్ హయత్‌నగర్‌లోని బాతుల చెరువును నింపడానికి కుతుబ్‌షాహిల కాలంలో నిర్మించిన జాలు కాల్వ నేడు అంతరించిపోతుంది. ఎవరు ఇష్టం వచ్చినట్లుగా వారు కాల్వను పూడ్చి ప్లాట్లుగా మార్చుకుంటున్నారు. అయినా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు తమకు ఏమి పట్టదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో కాల్వ పరిస్థితి అధ్వానంగా మారింది. హయత్‌నగర్ ఇన్ఫర్‌మేషన్ కాలనీ నుంచి ఇంజాపూర్‌కు వెళ్లే దారిలో ఉన్న ఈ కాల్వను రెండు రోజులుగా చదును చేసి పూడ్చివేశారు. కల్వర్టు వరకు కాల్వను మట్టితో నింపి ప్లాటుగా మార్చారు. ప్లాటు చుట్టూ ప్రీకాస్టు ప్రహరీని ఏర్పాటు చేస్తున్నారు. అక్కడ గజం ధర రూ. 50వేలు పలుకుతుండడంతో వ్యాపారులు కాల్వను సైతం వదలకుండా యథేచ్ఛగా ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారు.

బాతుల చెరువు నింపడానికి జాలు కాల్వనే ప్రధానం

హయత్‌నగర్‌లో ఉన్న హయత్‌నగర్ బక్షీ బేగం(మాసమ్మ) పేరు మీద అప్పట్లో తుర్కయంజాల్‌లో సుమారు 350 ఎకరాలలో మాసబ్ చెరువును నిర్మించారు. మాసబ్ చెరువు నిండిన తర్వాత వర్షం నీరు జాలు కాల్వ ద్వారా ఇంజాపూర్ మీదుగా హయత్‌నగర్ బాతుల చెరువుకు చేరేలా జాలు కాల్వను ఏర్పాటు చేశారు. దాదాపు ఐదు కిలో మీటర్ల దూరం ఉన్న ఈ కాల్వ ద్వారా వర్షం నీరు బాతుల చెరువుకు చేరేలా ఏర్పాటు చేశారు. ఈ చెరువులో నీరు ఉండడం వల్ల పుష్కలంగా భూగర్భ జలాలు ఉంటాయి. గొలుసుకట్టు చెరువులో భాగంగా ఈ కాల్వ అభివృద్ధికి గతంలో సుమారు రూ. 10లక్షలు కేటాయించారు. ఆ తర్వాత ఎవరు పట్టించుకోకపోవడంతో కాల్వ కబ్జాకు గురవుతూ వస్తుంది. బాతులచెరువు అలుగు నీరు కిందకు వెళ్లడానికి పూర్వకాలం నుంచి ఉన్న కాల్వ సైతం రియల్ వ్యాపారుల గుప్పెట్లో చిక్కుకుందని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు చెరువు, కాల్వల ప్రాముఖ్యతను గుర్తించి జాలుకాల్వ కబ్జా కాకుండా కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.


ప్లాటుగా మార్చిన జాలు కాల్వ

ప్రేమించి పెళ్లి చేసుకొని మోసం చేశాడని ఆందోళన

- భర్త ఇంటి ఎదుట భార్య నిరసన
- యాదాద్రిభువనగిరి జిల్లాలో ఘటన


అత్తవారి ఇంటిముందు వంటవార్పుతో నిరసన తెలుపుతున్న మహిళ

రాజాపేట, మే 22: ప్రేమించి పెళ్లి చేసుకొని మోసం చేశాడని భార్య భర్త ఎదుట ఆందోళన చేసింది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామస్థులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. రాజాపేట మండలం బూరుగుపల్లి గ్రామానికి చెందిన రేకులపల్లి మహిపాల్‌రెడ్డి హైదరాబాద్‌లోని బోడుప్పల్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. హైదరాబాద్‌లోని రామాంతపూర్‌కు చెందిన యువతితో 2021లో పరిచయం ఏర్పడింది. పరిచయం కాస్త ప్రేమగా మారి 2021 జూన్ 6వ తేదీన సింహాచలం దేవస్థానంలో ఇద్దరు పెళ్లి చేసుకున్నారు. కొంతకాలం హైదరాబాద్‌లోని నాగోల్‌లో ఉంటూ కుటుంబ సభ్యుల సమక్షంలో మరోసారి పెళ్లి చేసుకున్నారు. యువతి నుంచి 24 తులాల బంగారం, రూ.70లక్షల నగదుతో పాటు మోత్కూరులో ఉన్న ప్లాట్లు తీసుకొని తనకున్న అప్పులు తీర్చుకున్నాడు. 15 రోజుల తర్వాత ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టారు. తనను మోసం చేశాడని హైదరాబాద్‌లోని అంబర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టింది. కొంతకాలంగా మహిపాల్‌రెడ్డి మొహం చాటేస్తుండడంతో తనకు న్యాయం చేయాలని మహిపాల్‌రెడ్డి స్వగ్రామమైన బూరుగుపల్లిలోని మహిపాల్‌రెడ్డి ఇంటిముందు వంటా వార్పుతో కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం నిరసన దీక్ష చేపట్టింది. మహిపాల్‌రెడ్డి తల్లి పద్మ రెండు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి తన బంధువుల ఇంటికి వెళ్లడంతో తాళం వేసి ఉన్న ఇంటి ముందు నిరసన వ్యక్తం చేశారు. గ్రామస్థులు, కొంతమంది నాయకులు యువతీ దీక్షకు సంఘీభావాన్ని వ్యక్తం చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని దీక్ష విరమింపజేసేందుకు యత్నించారు. గురువారం మహిపాల్‌రెడ్డిని రప్పించి న్యాయం చేస్తామని ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి హామీ ఇవ్వడంతో యువతి కుటుంబ సభ్యులు దీక్షను విరమించారు.

మూడో రోజు టెట్‌కు 322మంది అభ్యర్థులు హాజరు

కొత్తపేట : కొత్తపేట న్యూ నాగోల్‌లో సీఐఎస్ డిజిటల్ ప్రై.లి.లో మూడో రోజు బుధవారం టెట్‌కు 322మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఉదయం షిఫ్ట్‌లో 185మంది అభ్యర్థులకు గాను 165మంది హాజరు కాగా మధ్యాహ్నం షిఫ్ట్‌లో 185మందికి గాను 157 మంది అభ్యర్థులు హాజరయ్యారు. టెట్‌కు సోమవారం 49 మంది, మంగళవారం 71 మంది, బుధవారం 48 మంది మూడు రోజుల్లో అభ్యర్థులు మొత్తం 168 మంది గైర్హాజరయ్యారు.

క్షణికావేశంలో వివాహిత ఆత్మహత్య

కొత్తపేట, మే 22 (ఆంధ్రజ్యోతి): క్షణికావేశంలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మన్సూరాబాద్ శైలజాపురి కాలనీలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. శైలజాపురి కాలనీలో నివాసముంటున్న బిల్లు మంజుల(37) బుధవారం భర్త మల్లేష్‌తో గొడవ పడింది. తర్వాత కాసేపటికి భర్త ఇంటినుంచి బయటకు వెళ్లాడు. అయితే భర్త వెళ్లిన తర్వాత క్షణికావేశానికి లోనైన మంజుల వెళ్లి పాలు నిల్వ చేసేందుకు వాడే రసాయనిక ద్రావం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. విషయం తెలుసుకున్న బంధువులు ఆమెను వనస్థలిపురంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి కుమార్తె బొల్లు సోని ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ నేత వాహనాన్ని వెంబడించిన దుండగులు

- తనపై దాడి చేయడానికే వచ్చారంటూ పోలీసులకు ఫిర్యాదు
- మీర్‌పేట్‌లో ఘటన

సరూర్‌నగర్, మే 22(ఆంధ్రజ్యోతి): రాత్రి తన కారులో ఇంటికి వెళ్తున్న మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని చైతన్యహిల్స్ కాలనీకి చెందిన బీజేపీ నేత, కంటెస్టెడ్ కార్పొరేటర్ డి.తిరుపతిరెడ్డి వాహనాన్ని కొందరు గుర్తు తెలియని దుండగులు ద్విచక్ర వాహనంపై వెంబడించారు. ఆయన అప్రమత్తమై వాహనం ఆపకుండా మరో దారిలో వెళ్లిపోవడంతో సదరు దుండగులు వెనక్కి వెళ్లిపోయారు. ఆయన వెంటనే డయల్ 100కు కాల్ చేయడంతో స్థానిక మీర్‌పేట్ పోలీసులు అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. కాగా స్థానికంగా నెలకొన్న రాజకీయ వైరం కారణంగానే కొందరు నేతల ప్రోద్బలంతో తనపై దాడి చేసి చంపడానికే ఆ దుండగులు వచ్చి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తూ బాధితుడు తిరుపతిరెడ్డి మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ కల్లూరి వెంకట్‌రాంరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మీర్‌పేట్ చైతన్యహిల్స్‌లో నివసించే బీజేపీ నాయకుడు తిరుపతిరెడ్డి ఇటీవలి ఎంపీ ఎన్నికల సందర్భంగా ఓ పార్టీ నేతలు డబ్బు పంచుతుండగా పట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా మరో పార్టీకి చెందిన ఓ నాయకుడు మీర్‌పేట్‌లో ఓ బహుళ అంతస్తుల భవనం నిర్మిస్తుండడంతో దానిపై అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆయా సంఘటనల నేపథ్యంలో ఆయన వివాదాస్పదుడిగా మారారు. ఈ క్రమంలో సదరు నాయకులే తనపై దాడికి దుండగులను పంపించి ఉంటారని ఆయన అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయాన్ని పోలీసుల దృష్టికి సైతం తీసుకెళ్లారు. మంగళవారం రాత్రి ఆయన తన కారులో ఇంటికి వస్తుండగా ముగ్గురు దుండగులు ద్విచక్ర వాహనంపై ఆయన వాహనాన్ని ఫాలో అయ్యారు. అనుమానం వచ్చిన తిరుపతిరెడ్డి తన ఇంటి సమీపంలోని మలుపు వద్ద సడన్‌గా కారును మరో దారిలోకి మళ్లించి స్పీడ్‌గా వెళ్లిపోయారు. దాంతో దుండగులు అక్కడే కాసేపు ఆగి ఇంటి వద్ద కొంతసేపు నిలబడి వెళ్లిపోయినట్టు సీసీ టీవీలో రికార్డు అయింది. వారి చేతుల్లో కర్రలు, రాడ్లు ఉన్నట్టు కనిపించిందని బాధితుడు పేర్కొన్నారు. కాగా తిరుపతిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సరూర్‌నగర్: మీర్‌పేట్ సెక్షన్ లలితానగర్ 11కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతు పనులు చేపట్టనున్నందున గురువారం ఉదయం 11గంటల నుంచి 12.30గంటల వరకు గాయత్రీనగర్, బాలాజీకాలనీ, లలితానగర్ చౌరస్తా, శివసాయినగర్, దాసరినారాయణనగర్, వీరమణికాలనీ, విజయాహోమ్స్, సీతాహోమ్స్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ ఆపరేషన్స్ ఎస్.ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రశాంతిహిల్స్ ఫీడర్ పరిధిలో

మీర్‌పేట్ సెక్షన్ ప్రశాంతిహిల్స్ 11కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా గురువారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2.30గంటల వరకు.. ప్రశాంతిహిల్స్, సిర్లాహిల్స్, శివసాయినగర్, న్యూబాలాజీనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదని ట్రాన్స్‌కో మీర్‌పేట్ ఏఈ ఆపరేషన్స్ ఎస్.ప్రభాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

జయశ్రీకాలనీ ఫీడర్ పరిధిలో

మీర్‌పేట్ సెక్షన్ జయశ్రీనగర్ 11కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతు పనులు చేపట్టనున్న దృష్ట్యా గురువారం మధ్యాహ్నం 3గంటల నుంచి 4.30గంటల వరకు జిల్లెలగూడ జడ్పీ హైస్కూల్ ఏరియా, గాంధీనగర్, సర్వోదయానగర్, శివాజీనగర్, సాయివిహార్‌నగర్, ఓల్డ్ సీతాహోమ్స్, తిరుమలా ఎన్‌క్లేవ్, ఎంఎల్‌ఆర్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదని ఏఈ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

ఆస్మాన్‌ఘడ్ డివిజన్ పరిధిలో

సైదాబాద్: టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ ఆస్మాన్‌ఘడ్ డివిజన్ పరిధిలోని మరమ్మతు పనుల కారణంగా గురువారం 11కేవీ ఎల్‌ఐసీ కాలనీ ఫీడర్ పరిధిలోని పరిసర ప్రాంతాలలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, ఏకలవ్యనగర్ ఫీడర్ పరిధిలోని పరిసర ప్రాంతాలలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2గంటల వరకు, అక్బర్‌బాగ్ ఫీడర్ పరిధిలోని పరిసర ప్రాంతాలలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ హన్మంతరెడ్డి తెలిపారు.

సరూర్‌నగర్ డివిజన్ పరిధిలో

సంతోష్‌నగర్ : టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని 11కేవీ పుష్పగార్డెన్, కొత్తపేట, న్యూమారుతీనగర్, గంగాఆస్పత్రి, జేబీకాలనీ, హరిపురి, విశాలాంధ్ర, సౌత్ ఎండ్‌పార్క్, సీతారామపురం, శివపార్వతి, గణేష్‌నగర్, బీరప్ప టెంపుల్, హుడాకాంప్లెక్స్, ఆర్‌కేపురం, హనుమాన్‌నగర్, నర్సింహపురికాలనీ, చిత్రాలేఅవుట్, రాజీవ్‌స్వగృహ, హుడాసాయినగర్, సీతారాంపురం, శివపార్వతి, గణేష్‌నగర్, సాయికాలనీ ఫీడర్ల పరిధిలో చెట్లు కొట్టివేత, నిర్వహణ పనుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని డీఈ తెలిపారు. 11కేవీ పుష్పగార్డెన్, కొత్తపేట, న్యూమారుతీనగర్, గంగాఆస్పత్రి, జేబీకాలనీ, హరిపురి, విశాలాంధ్ర, సౌత్ ఎండ్‌పార్క్, సీతారామపురం, శివపార్వతి ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 11గంటల నుంచి 12.30 గంటల వరకు, 11కేవీ హుడాకాంప్లెక్స్, ఆర్‌కేపురం, హనుమాన్‌నగర్, నర్సింహపురికాలనీ, చిత్రాలేఅవుట్, రాజీవ్‌స్వగృహ, హుడాసాయినగర్, సీతారాంపురం ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 3గంటల నుంచి 4.30 గంటల వరకు, 11కేవీ శివపార్వతి, గణేష్‌నగర్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో సాయంత్రం 5గంటల నుంచి 7గంటల, 11కేవీ సాయికాలనీ ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 3గంటల నుంచి 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు.